

దాళ్వాకు అనుమతి లేదు

- జలాశయాల్లో తక్కువగా నీటి లభ్యత
- సాగులోని పంటలు, తాగునీటి అవసరాలకే ఉన్న నీరు
- స్పష్టం చేసిన కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కృష్ణాడెల్టాలో రబీ సీజన్‌లో దాళ్వా పంటకు సాగునీరు విడుదల చేసేందుకు అవకాశం లేదని కలెక్టర్ బాలాజీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాడెల్టా ప్రాంత రైతులు రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా ఆరు తడి పంటలను మాత్రమే సాగుచేయాలని కోరారు. ఈ ఏడాది శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి ఈ నెల 11వ తేదీ వరకు ప్రకాశం బ్యారేజీకి 290 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. గత నెల నుంచి కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువగా ఉందని పేర్కొన్నారు. జలాశయాల్లో 189 టీఎంసీల నీటి లభ్యత ఉండాల్సి ఉండగా, 114 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నీటిని ప్రస్తుతం సాగులో ఉన్న వరిపంటను కాపాడేందుకు విడుదల చేయడంతోపాటు 2025 జూన్ వరకు తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవాల్సి ఉందని స్పష్టం చే శారు. పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 39 టీఎంసీల నీరు ఉందని, ఈ నీటిని 2025 ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం జూన్ మొదటి వారంలో విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నేడు రావి ప్రమాణస్వీకారం



రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కళ్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తదితరులు హాజరుకానున్నారు.

6లో

గౌతంరెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

- హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో వైసీపీ నేత పిటిషన్
- పూర్తి విచారణకు సమయంలేక విచారణ వాయిదా వేసిన కోర్టు



అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో వైసీపీ నేత గౌతంరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు తగినంత సమయం లేకపోవడంతో ఈనెల 26కి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. గౌతంరెడ్డి విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అప్పటివరకు పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఫోర్జరీ పత్రాలతో తన భూమిని ఆక్రమించడమే కాకుండా, తనను చంపేందుకు ప్రయత్నించారంటూ విజయవాడకు చెందిన గండూరి ఉమామహేశ్వరశాస్త్రి వైసీపీ నేత గౌతంరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవలే ఈ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. గురువారం మరోసారి ఆ వ్యాజ్యం విచారణకు రాగా గౌతంరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ స్పందిస్తూ.. కేసులో వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని భావిస్తే మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని అభ్యర్థించారు. అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు తామూ సిద్ధంగా ఉన్నామన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు తగిన సమయం లేనందున తదుపరి విచారణను ఈనెల 26కి వాయిదా వేశారు.



8లో

కూచిపూడి శ్రీసిద్ధేంద్ర యోగి కళావేదికపై గురువారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్య రూపకం నాట్య పరిమళాలు వెదజల్లింది. శ్రీకృష్ణునిగా ప్రణుష రెడ్డి, సత్యభామగా అంబికా సిద్దాబత్తుల, రుక్మిణిగా ప్రణవి, నారదునిగా సంధ్య చూపిన హావభావాలు మంత్రముగ్దుల్ని చేశాయి.



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నాగాయలంక శ్రీ రామపాదక్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి కర్పూర జ్యోతిని వెలిగించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి జ్యోతిని దర్శించుకున్నారు. రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. -నాగాయలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)

ధాన్యం.. దయనీయం

ధాన్యం కొనుగోలులో ఈ క్రాప్ పంట పరిమితి తగ్గింపుతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 25 ఎకరాల పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే కేవలం 12 ఎకరాలకే కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన ధాన్యం ఏం చేసుకోవాలని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేస్తే ఎత్తడంలేదని మండిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 25 ఎకరాల పంట పరిమితిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.



- ధాన్యం కొనుగోళ్లలో ఈ క్రాప్ పంట పరిమితి తగ్గింపు
- ఒక రైతుకు 25 ఎకరాల నుంచి 12 ఎకరాలకు కుదిస్తూ సాఫ్ట్‌వేర్‌లో మార్పు
- కొనుగోలు కేంద్రానికి గురువారం తీసుకెళ్లిన ధాన్యం వెనక్కి పంపిన సిబ్బంది
- ఇంటికి తీసుకెళ్లి ఏం చేసుకోవాలని రైతుల ఆగ్రహం
- జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసేందుకు యత్నం
- ఫోన్ ఎత్తకపోవడంపై మండిపడుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం దిగుబడిపై ఇచ్చిన అంచనా కంటే అధికంగా ఖరీఫ్‌లో ధాన్యం ఉత్పత్తి కావటంతో నిర్దేశించిన ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెరిగింది. దీంతో సివిల్ సప్లయిస్ ప్రొక్యూర్‌మెంట్ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను జిల్లా మేనేజర్లు అమలు పరుస్తున్నారు. ఈ క్రాప్‌లో నమోదైన దాని ప్రకారం 25 ఎకరాల వరకు పంట కొనుగోలు చేయాల్సి ఉంటే కేవలం 12 ఎకరాల పంటను మాత్రమే కొనుగోలు చేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. అయితే ఈ క్రాప్ పంటకు సంబంధించి 25 ఎకరాలు వరకు కొనుగోలు చేస్తారన్న ముందస్తు సమాచారంతో రైతులంతా వరికోతలు జరిపి, నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టి బస్తాల్లో నింపి లారీల్లో ఎక్కించి కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లిన తర్వాత 12 ఎకరాల పంట వరకే కొనుగోలు చేయగలమని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

12 ఎకరాల పంటకు మించి కొనలేం..

కృష్ణాజిల్లాలో పామర్రు మండలం పెద్ద మద్దాలి గ్రామానికి చెందిన రైతులు గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల్లో ధాన్యాన్ని తీసుకెళ్లారు. సాఫ్ట్‌వేర్‌లో 12 ఎకరాలు మాత్రమే చూపిస్తోందని, అంతకు మించి కొనలేమని అక్కడి సిబ్బంది చెప్పడంతో రైతులు హతాశులయ్యారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని లబోదిబోమన్నారు. ఇది మా ఒక్క కేంద్రం పరిధిలోనిది కాదని రాష్ట్ర వ్యాప్తంగా ఇలాగే ఉందని సిబ్బంది సమాధానం చెప్పడంతో రైతులు ఆందోళన చెందారు. ధాన్యం లారీల్లోకి ఎక్కించి కేంద్రాల దగ్గరకు తీసుకువచ్చాక.. ఎలా వెనక్కి తీసుకువెళ్లేది అంటూ బావురుమన్నారు. లాభం లేదని కొంతమంది రైతులు కృష్ణాజిల్లా సివిల్ సప్లయిస్ డీఎంకు ఫోన్ చేశారు. డీఎం ఫోన్ ఎత్తకపోవడంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. ఈ క్రాప్ పంట పరిమితి తగ్గింపుపై రైతులు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై వాస్తవ నివేదిక ఇవ్వలేదా?

ధాన్యం దిగుబడిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి వాస్తవ ప్రాతిపదికన నివేదిక ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం సివిల్ సప్లయిస్‌కు చిన్నదైపోయింది. దీంతో ఈ క్రాప్‌లో నమోదైన 25 ఎకరాలు కాకుండా 12 ఎకరాలని సవరించుకున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారో, లేదో కూడా స్పష్టత లేదు. ఒక వేళ ముందే చెప్పి ఉంటే.. ప్రభుత్వం రైతులకు అనుకూలంగానే నిర్ణయం తీసుకుని ఉండేది. ప్రభుత్వానికి చెప్పకుండా కొనుగోళ్ల పరిమితిని తగ్గించటం వల్ల రైతుల్లో ఆందోళన నెలకొంది. తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ముందుగా కొనుగోళ్లు జరిపి ఆ తర్వాత రైతుల నుంచి డిమాండ్ ఉందని చెప్పాలని సివిల్ సప్లయిస్ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. అప్పటి వరకు రైతులు ధాన్యాన్ని ఉంచుకోలేరు. అప్పులు తెచ్చిన డబ్బులను తిరిగి చెల్లించాలంటే పండించిన ధాన్యాన్ని రైతులు వెంటనే అమ్ముకోవాలి. లేదంటే వారు మరింత ఇబ్బందులకు గురి అవుతారు. ఈ విషయంపై సివిల్ సప్లయిస్ అధికారులు పునరాలోచించి తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

ధాన్యం బస్తాల లోడుతో లారీ



మిల్లర్ల మాయాజాలం

ఉమ్మడి జిల్లాలో రైస్ మిల్లర్ల మాయాజాలం ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా నడుస్తోంది. ప్రభుత్వ గిట్టుబాటు ధరలను ఎక్కడా కూడా మిల్లర్లు అమలు చేయటంలేదు. మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులను నష్టపరుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం 1061 రకానికి మద్దతు ధరగా రూ.1,760 నిర్ణయించింది. ఎరుపులు కేటగిరీకి సంబంధించి మాత్రం రూ.1,710 మద్దతు ధరను ప్రకటించింది. ఈ మద్దతు ధర మిల్లర్ల దగ్గర చెల్లటం లేదు. తేమ శాతాన్ని ప్రాతిపదికగా తీసుకోవాల్సిన మిల్లర్లు అందరికీ ఒకటే విధానాన్ని అమలు చేస్తున్నారు. తేమ శాతం పేరుతో 1061 రకానికి రూ.1,500, ఎరుపులు రకానికి రూ.1,450 చొప్పున నిర్దేశిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర కంటే కూడా రూ.260 తగ్గిస్తున్నారు. ఈ తగ్గించిన నగదు కూడా రైతులు ముందే మిల్లర్లకు చెల్లించాలి. ఎందుకంటే.. ప్రభుత్వం మద్దతు ధర ప్రాతిపదికన మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాకు ఆ మొత్తం డబ్బులను జమ చేస్తుంది. వీటిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ క్రాప్‌లో 12 ఎకరాలకు మాత్రమే పరిమితం చేయటంతో మిగిలిన ధాన్యాన్ని రైతు అత్యవసరంగా అమ్ముకోవాలంటే మిల్లర్లే దిక్కు. మద్దతు ధర విషయంలోనే ఇలా ఉంటే.. రైతుల ఆర్థిక అవసరాల ప్రాతిపదికగా చూస్తే పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. ప్రభుత్వం ఈ రెండు అంశాల మీద సీరియస్‌గా దృష్టి సారిస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఆర్టీసీలో సమ్మె సైరన్

- విలీనానంతర సమస్యలపై అన్ని సంఘాలు ఆందోళన బాట
- విజయవాడ వేదికగా విస్తృతస్థాయి సమావేశాలు
- సమావేశాల తర్వాత ప్రాథమిక ఆందోళనలకు పిలుపు
- ఉన్నతాధికారులు స్పందించకపోవడం వల్లే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు సమ్మె సైరన్ మోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో విలీనానంతర అపరిష్కృత సమస్యలు, విలీనానికి ముందు లిఖితపూర్వక ఒప్పందాలను అమలు చేయకపోవటం, ప్రస్తుత సమస్యలపై ఉద్యమం చేసేందుకు సమాయత్తమవుతున్నాయి. విజయవాడ వేదికగా రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి అడుగులు వేస్తున్నాయి. ఐక్యంగా కాకపోయినా వేర్వేరుగా అన్ని సంఘాలు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగానే ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ సమావేశాలనంతరం ప్రాథమిక ఆందోళనా కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. గుర్తింపు సంఘాలైన ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ)తో పాటు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఉద్యమ శంఖారావం మోగించే దిశగా కదిలాయి.



డిమాండ్లు ఇవీ..

తొలుత తమ డిమాండ్లను ఉన్నతాధికారుల ముందుంచాయి. ఇవన్నీ పరిష్కారానికి నోచుకోకపోవటంతో ఆందోళనల వైపు అడుగులు వేస్తున్నాయి. ఆర్టీసీ కార్మిక సంఘాల డిమాండ్లు రెండు కేటగిరీల్లో ఉన్నాయి. ఉద్యోగుల సమస్యలతో పాటు సంస్థను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలను కూడా ఈ డిమాండ్లలో ఉంచారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2017 పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, విలీనానంతరం ఇచ్చిన తొలి పీఆర్సీ బకాయిలను చెల్లించాలని, కొత్త నిరుపయోగ ఈహెచ్ఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత అపరిమిత వైద్యసేవల విధానాన్ని కొనసాగించాలని, రద్దు చేసిన ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీలను అమలు చేయాలన్నవే ప్రధాన డిమాండ్లు. ప్రస్తుతం నిలిపివేసిన నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, టీఏ బిల్లులు, ఇతర అలవెన్సులను, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కూడా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికులు టికెట్ తీసుకోకపోతే డ్రైవర్లు, కండక్టర్లకు విధిస్తున్న జరిమానాలకు సంబంధించి 2019 సర్క్యులర్‌ను తిరిగి అమలు చేయటం కానీ, జీవో నెంబర్ 70, 71ను సవరించాలని కానీ డిమాండ్ చేస్తున్నారు. స్ప్రింగ్, టైర్, యూటీఎస్ టిమ్ము డ్యామేజీలను ట్రాఫిక్ సిబ్బందిపై మోపి రికవరీలు చేయటం వీడాలని, కార్మికశాఖ మార్గదర్శకాల ప్రకారం అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. సంస్థాగతంగా ఖాళీ స్థానాల్లో సిబ్బందిని భర్తీ చేయాలని, స్క్రాప్‌కు వెళ్లే బస్సులను నిలుపుదల చేయాలని, డిమాండ్‌కు అనుగుణంగా 5 వేల కొత్త బస్సులు కొనాలని కోరుతున్నారు. ఈ డిమాండ్లకు సంబంధించి ఈయూ నేతలు పి.దామోదరరావు, జీవీ నర్సయ్య, ఎన్ఎంయూఏ నేతలు వీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు సీహెచ్ సుందరరావు, ఎస్.అయ్యప్పరెడ్డి.. ఉన్నతాధికారులకు పదేపదే మెమోరాండంలు సమర్పించారు. అయినా సమస్యలకు పరిష్కారం దొరక్కపోవటంతో ఉద్యమంవైపు అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతాం

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఓవరాల్ చాంప్ విశాఖపట్నం



సభలో మాట్లాడుతున్న బందరు ఎంపీ బాలశౌరి. చిత్రంలో జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఎన్నారై సతీష్, డీఈవో రామారావు,

6లో

భూముల రీసర్వేను సక్రమంగా చేయండి

8లో



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ.చిత్రంలో జేసీ గీతాంజలి శర్మ

వీలైనంత త్వరగా బెయిల్ పిటిషన్ విచారించండి

- హైకోర్టులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ అభ్యర్థన
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులకు కోర్టు ఆదేశం
- విచారణ వారం రోజులకు వాయిదా

8లో



నాగాయలంకలో నిర్మాణ దశలో ఆగిపోయిన మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం

6లో

నిర్లక్ష్యానికి నిదర్శనం

- ఐదేళ్లుగా నిర్మాణానికి నోచని మత్స్యకార భవనం
- పిల్లర్ల దశలోనే నిలిపేసిన కాంట్రాక్టర్
- మత్స్యకారుల సంక్షేమం పట్టని వైసీపీ ప్రభుత్వం
- పిచ్చిమొక్కలకు ఆవాసంగా షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం



రాత్రి వేళల్లో మట్టి తరలిస్తున్న టిప్పర్లు, వాహనాలను అడ్డుకుంటున్న చిన్న దళితవాడ వాసులు

యథేచ్ఛగా మట్టి రవాణా!

- రాత్రివేళల్లో గుట్టుగా ఇటుక బట్టీలకు తరలింపు
- టిప్పర్లను అడ్డుకున్న దళితవాడ వాసులు
- ఫిర్యాదులపై స్పందించని అధికారులు.. పట్టుకున్న వాహనాలు మాయం!

మైలవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మైలవరం మండలం పుల్లూరు గ్రామ సమీపంలో తోటల్లో అక్రమంగా నిల్వ చేసిన మట్టిని భారీ టిప్పర్ల ద్వారా మైలవరం-కుంటముక్కల రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో పెద్దఎత్తున వాహనాలలో మట్టిని రవాణా చేయడంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చిన్న దళితవాడ వాసులు టిప్పర్లను అడ్డుకుని రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వాహనాలను రాజకీయ పలుకుబడితో బట్టీల నిర్వాహకులు విడిపించుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో అడ్డగోలు రవాణా ఏంటని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

గ్రామస్థులు పట్టించిన వాహనాలు మాయం

గ్రామస్థులు పట్టించిన టిప్పర్లను వదిలేయడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు చేయాల్సిన పనిని గ్రామస్థులు చేసినా వాహనాలను అధికారులు వదిలేయడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి రవాణాకు ఎలాంటి అనుమతుల్లేవు

- బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్

మట్టి రవాణాకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ నిల్వలు ఉంటే పరిశీలించి సీజ్ చేస్తాం.



రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణంపై రైతుల నుంచి అభ్యంతరాలు తెలుసుకుంటున్న అధికారులు

అండర్ బ్రిడ్జిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- అధికారులకు రైతుల విజ్ఞప్తి

జి.కొండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చెర్వుమాధవరం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యుబీ) నిర్మాణం జరిగే స్థలాన్ని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ నిర్మాణం వల్ల కలిగే ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ-సికింద్రాబాద్ రైలు మార్గంలో కొత్తగా మరో ట్రాక్ వస్తున్న నేపథ్యంలో చెర్వుమాధవరం రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ నిర్మాణం వల్ల కలిగే ఇబ్బందులను రైతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జ్ నిర్మాణ సమయంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షపునీరు బ్రిడ్జిలోనే నిల్వ ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోరని, నిర్మాణ సమయంలోనే సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రైల్వే అధికారులు, డీటీ విజయ్‌కుమార్, ఏవో ఎం.రాంకుమార్‌తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా

రావి ప్రమాణస్వీకారం నేడు



గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడ గురునానక్‌కాలనీ నాక్ కళ్యాణమండపంలో సాయంత్రం 4గంటలకు జరగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తదితరులు పాల్గొనున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం ఎన్నారై వెనిగండ్ల రాముకు అవకాశం ఇచ్చింది. వెనిగండ్ల రాముకు రావి వెంకటేశ్వరరావు వెన్నంటి ఉండి పార్టీ విజయానికి కృషి చేశారు. భవిష్యత్తులో రావికి సముచిత స్థానం కల్పిస్తానని నాడు చంద్రబాబు హామీ యిచ్చారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో స్వాతి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, హాజరైన అభ్యర్థులు

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బందరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆర్డీవో కె.స్వాతి, డ్వామా పీడీ సువర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి సురేంద్రబాబు, సీడీపీవోలు గ్లోరీ, సముద్రవేణి, సుధారాణిలు ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 67 పోస్టులు ఖాళీగా ఉండగా.. మచిలీపట్నం డివిజన్‌లో 3 మినీ అంగన్వాడీ, 17 హెల్పర్ల ఇంటర్వ్యూలకు 48 మంది హాజరయ్యారు. గుడివాడ డివిజన్‌లో 3 అంగన్వాడీ, 25 హెల్పర్, ఉయ్యూరు డివిజన్‌లో 3 మినీ అంగన్వాడీ, 2 అంగన్వాడీ కార్యకర్తలు, 15 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నిర్లక్ష్యానికి నిదర్శనం!

- ఐదేళ్లుగా నిర్మాణానికి నోచని మత్స్యకార భవనం
- పిల్లర్ల దశలోనే పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- మత్స్యకారుల సంక్షేమం పట్టని వైసీపీ ప్రభుత్వం
- పిచ్చిమొక్కలకు ఆవాసంగా షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం



నాగాయలంకలో నిర్మాణ దశలో ఆగిపోయిన మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం

(నాగాయలంక, ఆంధ్రజ్యోతి)

2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కృష్ణా జిల్లా నాగాయలంక మత్స్యకారులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ. కోటితో షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనాన్ని మంజూరు చేసింది. ఈ భవనంలో మత్స్యకారులు తమ విలువైన వలలు భద్రపర్చుకోవడం, సభలు సమావేశాలతోపాటు తుపాను సమయాల్లో రక్షిత భవనంగా ఉపయోగపడుతుంది. చేపల సంతలకు వచ్చే మత్స్యకారులకు వసతిగా ఉండేలా అన్ని సదుపాయాలతో భవనాన్ని నాగాయలంక పడవల రేవులో దక్షిణ భాగంలో నిర్మించేందుకు రెవెన్యూ శాఖ స్థల సేకరణ చేసి మత్స్యశాఖకు అప్పగించింది. అన్ని అనుమతులతో భవనం నిర్మాణానికి సిద్ధం కాగా, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

2019 డిసెంబరు 20న అప్పటి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టరు నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్లు వేసి వదిలేశాడు. నాటి నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్టరు పనులను చేయలేదు. మరో కాంట్రాక్టర్‌కి నిర్మాణ పనులను అప్పగించడంలో అధికారులు కూడా పట్టించుకోలేదు. దాంతో నిర్మానం చుట్టూ పిచ్చి చెట్లు, ఇనుప చువ్వలు తుప్పపట్టి భవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయని మత్స్యకార నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని పూర్తి చేయాలని మత్స్యకార నేతలు పలుమార్లు ఆందోళన చేసినా నాటి వైసీపీ పాలకుల్లో స్పందన లేదు. మండలంలోని మత్స్యకారులందరికీ బహుళ విధాలుగా ఉపయోగపడే ఈ భవనాన్ని కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వైసీపీ కక్షపూరిత చర్య వల్లే..

- లకనం నాగాంజనేయులు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు



తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరు కావటం వల్లనే గత వైసీపీ ప్రభుత్వం ఈ షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవన నిర్మాణాన్నినిలిపివేసింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి

నాగిడి తాతారావు, జిల్లా నాయకుడు



భవన నిర్మాణం ఆగిపోవటం వల్ల మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్లు, వరదల సమయంలో వలలు, వృత్తి పరికరాలు భద్రపర్చుకోవటానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నిధులు మురిగిపోయాయి

-మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, అవనిగడ్డ

మత్స్యకారుల భవనాన్ని సకాలంలో కాంట్రాక్టర్ నిర్మించక పోవటంతో ఆ నిధులు మురిగిపోయాయి. మూడు నెలల క్రితం సదరు భవనానికి నిధులు కేటాయించాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే భవనాన్ని పూర్తి చేస్తాం.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

మత్స్య సంపద కాపాడుకుందాం

ఘంటసాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపం చ మత్స్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమన్వయ కర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మత్స్యకారులకు గుర్తింపును అందించటం కోసం, మత్స్య పరిశ్రమకి ఉజ్వల భవిష్యత్తు ఉండాలనే ఆకాంక్షతో ప్రపంచ మత్స్య దినోత్సవం ప్రతి ఏటా నవంబరు 21న జరుపుకుంటారన్నారు. ప్రపంచంలోని మత్స్య సంపదను కాపాడుకునే చర్యలను మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ వివరించారు. మత్స్య వనరు లు లక్షలాది మందికి ఉపాధిని అందిస్తుందన్నారు. మత్స్యకార సొసైటీ చెరువులలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ మంజువాణి, కృష్ణవేణి, డాక్టర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



విజయవాడకు బస్సులో తరలివెళ్తున్న మత్స్యకారులు

విజయవాడకు తరలిన మత్స్యకారులు

నాగాయలంక : విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవ సభకు మత్స్యకార సంఘ నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు నాయకత్వంలో మత్స్యకారుల సహకార సంఘాల ప్రతినిధులు బస్సులలో, ఇతర వాహనాలలో తరలివెళ్లారు.



గరిశపూడి వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గ్రామీణాభివృద్ధికి కృషి

- ఎంపీ వల్లభనేని బాలశౌరి

కృత్తివెన్ను, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గరిశపూడి వద్ద నుంచి బలరామమూర్తి దిబ్బ వరకు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు గురవారం శంకుస్థాపన చేశారు. అలాగే చినగొల్లపాలెం గ్రామంలో కెనరా బ్యాంకు సాయం రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. జనసేన నేత బండి రామకృష్ణ, పంచకర్ల సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాళ్వాకు నీరిచ్చి ఆదుకోండి

జిల్లా శివారు ప్రాంతంలో ఖరీఫ్ తీరని నష్టాన్ని కలిగించినందున రెండో పంటకు నీరిచ్చి పుణ్యం కట్టుకోవాలంటూ రైతులు కృత్తివెన్ను సెంటర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే కార్లను వారి తమ గోడును వెళ్లగక్కారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరు రెండో పంటకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి, చర్చిస్తానని ఎంపీ తెలిపారు.

మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతాం

- ఎంపీ వల్లభనేని బాలశౌరి
- రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఓవరాల్ చాంప్ విశాఖ

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. గత మూడు రోజులుగా జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 38వ బాక్సింగ్ పోటీలు గురువారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు మచిలీపట్నంలో స్టేడియం నిర్మాణానికి అడుగడుగునా అడ్డు తగిలారన్నారు. కేంద్ర నిధులతో రెండేళ్లలో మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతామన్నారు. విద్యార్థుల చదువు, క్రీడలకు తగిన ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, క్రీడల వల్ల మానసిక, శారీరక వికాసం కలుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, క్రీడాకారులకు తన వంతు సాయం అందిస్తామన్నారు. ఎన్నారై సతీష్ మాట్లాడుతూ, చైనా కన్నా భారతదేశ జనాభా పెరిగిందని, అయితే చైనాతో పాటు అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశం పోటీ పడలేకపోతున్నదన్నారు. ఒలింపిక్ క్రీడల్లో భారతీయులు పోటీ పడేందుకు బాల్యం నుంచి శిక్షణ అవసరమన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ, మూడు రోజులుగా రాష్ట్రంలోని 500 మంది క్రీడాకారులకు భోజన వసతి సదుపాయాలు కల్పించడంలో జాగ్రత్త వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.అజయ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, జాతీయ క్రీడాకారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బందరు ఎంపీ బాలశౌరి



విశాఖ క్రీడాకారులదే విజయం...



ఎంపీ నుంచి షీల్డ్ అందుకుంటున్న విశాఖ జట్టు

విశాఖ క్రీడాకారులు మూడు కేటగిరిల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచి తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్ 14 బాలుర కేటగిరిల్లో విశాఖ జట్టు విన్నర్స్‌గా, విజయనగరం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అండర్ 17 బాలుర పోటీల్లో విశాఖ జట్టు విన్నర్స్‌గా, శ్రీకాకుళం జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అండర్ 17 బాలికల పోటీల్లో విశాఖ జట్టు ప్రథమ స్థానంలో, నెల్లూరు జట్టు రన్నర్స్‌గా నిలిచింది.

అసెంబ్లీ వేదికగా

ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలి

యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా కోరారు. 1276 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బ్రహ్మయ్యలింగయ్య చెరువు రిజర్వాయర్‌గా చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ సొమ్ముతో పాటు మట్టినీ దోచేశారని విమర్శించారు. బ్రహ్మయ్యలింగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. పోలవరం, ఏలూరు కాలువను అనుసంధానం చేయాలని, రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కులం ప్రాంతాల్లో ఏలూరు కాలువపై వంతెనలను నిర్మించాలని కోరారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు ప్రహరీ, రెయినింగ్ పాడైపోయాయని వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యపై..

బొండా ఉమామహేశ్వరరావు



అజిత్‌సింగ్‌నగర్ : సెంట్రల్ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలుగా వేలాది ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదని, పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ కల్పించేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. మధురానగర్ తుంగం రామల వీధి, పాయకాపురంలోని దేవినేని గాంధీపురం, ఎల్‌బీఎస్‌నగర్, పటేల్‌నగర్, పాకిస్థాన్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్‌లోని నందమూరినగర్ ప్రాంతాల్లో సుమారు నాలుగువేల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు 2019లో టీడీపీ ప్రభుత్వం జీవో 74ను తీసుకువచ్చిందని, అనంతరం ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ మరుగున పడిందన్నారు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

శిథిల వంతెనలకు నిధులు కేటాయించండి

వర్లకుమార్ రాజా



పామర్రు : జగన్ ఐదేళ్ల అరాచక పాలనతో విసిగి పోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించి.. రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టే బాధ్యతలు అప్పగించారని.. ఆ బాధ్యత నెరవేర్చాలిన అవసరం తమపై ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అనేక చోట్ల శిథిలావస్థకు చేరిన వంతెనల వల్ల అటు ప్రజలు, ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ప్రమాదకరంగా ఉన్న వంతెనల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్‌శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో దశాబ్ద కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు స్థలం మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విద్యా సుమాలు విరబూయిస్తా

- పదిలో నూరుశాతం ఫలితాలకు కృషి
- వంద రోజుల ప్రణాళికకు రూపకల్పన
- డీఈవో పీవీజే రామారావు



కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పీవీజే రామారావు వరుసగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మీవో కార్యాలయాలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రామారావును 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది.

? కృష్ణాలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు

● జిల్లాలో వివిధ డివిజన్లలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అధిక శాతం ఉపాధ్యాయుల్లో నైపుణ్యం, పట్టుదల కలిగిన వారున్నారు. ఈ ఏడాది విద్యా ప్రమాణాలు పెంచేలా ప్రధానోపాధ్యాయులకు సూచనలిచ్చాం.

? పదో తరగతి విద్యార్థులకు తీసుకునే ప్రత్యేక కార్యక్రమాలు ఏమిటి?

● పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వంద రోజుల ప్రణాళిక రూపొందించాం. ఉదయం గంట, సాయంత్రం గంట అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

? వెనుకబడిన విద్యార్థుల కోసం ఏ కార్యక్రమాలు చేపడుతున్నారు?

● వెనుకబడిన విద్యార్థులను ఆయా సబ్జెక్టు టీచర్లు దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ అందిస్తున్నాం. విద్యావేత్తలతో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం. గతేడాది 90.5 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. టాప్ 5లో జిల్లాను తప్పనిసరిగా ఉంచుతాం.

? విద్యార్థుల గుణాత్మకతను ఎలా బేరీజు వేస్తారు?

● జిల్లాలో ఎంపిక చేసిన 124 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు గణితంలో పరీక్షలు నిర్వహించి వారి స్థాయిని తెలుసుకుంటాం.

? పోటీ పరీక్షలకు ఏ విధమైన తర్ఫీదు ఇస్తున్నారు?

● విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించాం.

? మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

● మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిపేందుకు ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు ఇచ్చాం. ముందుగా భోజనాన్ని రుచి చూడాలని చెప్పాం. భోజనంలో నాణ్యత పాటించాల్సిందే.. అలసత్వం చూపే ఉపాధ్యాయులకు ఎంఈవోలు, డీవైఈవోలు మార్గదర్శకత్వం వహిస్తారు.

(మచిలీపట్నం టౌన్ ఆంధ్రజ్యోతి)



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 580

350 మందికి నేత్ర పరీక్షలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో ముడి పెట్టకుండా నిరంతరం ప్రజలకు సేవలు అందించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపును ప్రతి కార్యకర్త పాటించి, పార్టీని బలోపేతం చేయాలని జనసేన గన్నవరం నియోజకవర్గం మీడియా కో ఆర్డినేటర్ గరికిపాటి శివశంకర్ సూచించారు. గురువారం తన జన్మదినం సందర్భంగా విజయవాడ రోడ్డులో ట్రాఫిక్ స్టేషన్ వద్ద ఏలూరు శంకర గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రీసెర్చ్ సెంటర్ అధినేత డాక్టర్ నాదెళ్ల విష్ణువర్ధన్‌తో కలిసి శివశంకర్ శిబిరాన్ని ప్రారంభించారు. 350 మందికి నేత్ర పరీక్షలు చేయగా, 60 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. శిబిరాన్ని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించి శివశంకర్‌ను అభినందించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించరా?

● అధికారుల తీరుపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం

కంకిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించరా? అంటూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకిపాడులో భద్రాచలం వారి వీధిలోని రోడ్డును గురువారం ఆయన పరిశీలించారు. రోడ్డు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి నెలలు గడుస్తున్నా రోడ్డు అభివృద్ధి పనులు ఎందుకు ప్రారంభించలేదని పీఆర్ ఏఈ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు గమనించరా అని నిలదీశారు. తక్షణం రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభించాలని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణకు సూచించారు. తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, చలవాది రాజ, షేక్ బాజి పాల్గొన్నారు.


కంకిపాడు భద్రాచలం వారి వీధిలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

పెనమలూరు: వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ సాయం కోసం అర్జీలు దాఖలు చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. తాడిగడప మునిసిపాలిటీ స్థాయిలో రూ.25 లక్షల విలువైన చెక్కులను గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన అందించారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, అంగిరేకుల మురళి, అనంతనేని ఆజాద్, శొంఠి శివరాంప్రసాద్, తుమ్మల రాంకుమార్, ఇమాం, మారం భరద్వాజ్, కొద్దు కోటేశ్వరరావు, తమ్ము అశోక్ పాల్గొన్నారు.


ప్రసాదంపాడు కోదండ రామాలయంలో దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలు

కోదండ రామాలయంలో కోటి దీపోత్సవం

ప్రసాదంపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రసాదంపాడు కోదండ రామాలయంలో 16వ వార్డు సభ్యుడు గూడపాటి శివదుర్గ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ సర్నాల గంగారత్నం, తెలుగుమహిళ గ్రామ అధ్యక్షురాలు తుపాకుల శివలీల, మాజీ సర్పంచ్ కొమ్మా సుబ్బమ్మ, కొమ్మ దీప్తి, శాంతి, అనురాధ, భక్తులు పాల్గొన్నారు.


భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా శాంతి కల్యాణం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాపులపాడులో భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి ఘనంగా శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్య, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, గొట్టిపాటి రాంబాబు, గూడపాటి రత్నశేఖర్, అడపా సత్యనారాయణమూర్తి, గొట్టిముక్కల రామకృష్ణంరాజు, బండారు వెంకటేశ్వరరావుతో పాటు మరో 31 పుణ్యదంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేద పండితులు ఆర్వపల్లి బుచ్చిరామశర్మ, కోసూరి మురళీకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.


వీరవల్లి షిరిడి సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వీరవల్లిలోని షిరిడిసాయిబాబా ఆలయంలో కార్తీక సమారాధన ప్రత్యేక పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. మహిళలు విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం పఠించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో పూజలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాపులపాడు దాసాంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో నూతనంగా గణపతి, నాగేంద్రస్వామి విగ్రహాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 2న ప్రతిష్ఠించనున్నారు. విగ్రహాలకు కళాపకర్షణ, పూర్ణాహుతి కార్యక్రమాలను యాజ్ఞకబ్రహ్మ వేదాల వెంకటాచార్యులు నిర్వహించారు.


రామన్నగూడెం హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య ద్వారా మాత్రమే లక్ష్యాన్ని సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు పేర్కొన్నారు. రామన్నగూడెం హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, సోషల్‌మీడియాలో వచ్చే అనవసరమైనవి చూడకుండా పరీక్షలకు సిద్ధమవ్వాలని విద్యార్థులకు ఆయన సూచించారు. గత సంవత్సరం 6, 7, 8, 9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు జయరామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

పెనమలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పోరంకి శ్రీనివాసనగర్‌లోని షిరిడీ సాయి ఆలయ ప్రాంగణంలో పీవీఆర్ కార్డియాక్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 388 మంది శిబిరానికి విచ్చేశారు. అందులో 186మందికి ఉచితంగా ఈసీజీలు, ఎకో పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ, ఆలయ అధ్యక్షుడు మున్నంగి అర్జునరెడ్డి, వైద్యులు వినయ్, దివాకర్, సుభద్ర పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న దత్త విజయానందతీర్థస్వామి

ముగిసిన శ్రీసూక్త మహాయాగం

గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేసరపల్లి శివారు గణపతి సత్యానంద ఆశ్రమంలోని పంచతత్వ గురుపాదుకా క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీసూక్త మహాయాగం గురువారం ఘనంగా ముగిసింది. గణపతి సచ్చిదానందస్వామి ఆదేశాల మేరకు దత్త విజయానంద తీర్థస్వామి పర్యవేక్షణలో మూడు రోజులపాటు ఈ క్రతువును నిర్వహించారు. తొలుత గురువందనం, గణపతి ప్రార్థన చేశాక, హోమాన్ని తిరిగి ప్రారంభించారు. స్వామీజీ నేతృత్వంలో శ్రీ చక్ర అర్చన, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, శ్రీ సూక్త మహాయాగానికి పరిసమాప్తి పలికారు. భక్తులకు దత్త విజయానంద తీర్థస్వామి అనుగ్రహభాషణం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు గొంది రాజా, ఎం.ప్రభాకర్‌చౌదరి, రామ్మోహనరావు క్షేత్ర పండితులు ప్రవీణ్ శర్మ, మూల్పూరి మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆహార పంటలను సాగు చేయడం వలన అనేక ప్రయోజనాలు కలుగుతాయని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగమల్లేశ్వరి తెలిపారు. రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం బాపులపాడు మండల సమైక్య ఈసీ సభ్యులకు మంగళవారం, బుధవారం రెండు రోజులు పాటు శిక్షణ తరగతులను బాపులపాడు వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి, ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు. రసాయనిక ఎరువులతో సాగుచేసే పంటలను వినియోగించడం వలన కలిగే నష్టాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే సేంద్రియ ఎరువులు, పురుగు మందుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఏరియా కో ఆర్డినేటర్ నాయక్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జబర్లపూడిలో చైన్‌స్నాచింగ్

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వచ్చి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కుపోయిన సంఘటన బుధవారం సాయంత్రం జబర్లపూడిలో జరిగింది. ఉయ్యూరు రూరల్ కె.సురేశ్ వివరాల ప్రకారం జబర్లపూడి గ్రామానికి చెందిన కొడాలి భవాని తన ఇంటి సమీపాన ఉన్న భర్త సమాధి వద్ద దీపారాధన చేసి వస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరిలో ఒకరు ఆమె మెడలో గొలుసు గుంజుకున్నారు. ఆమె ప్రతిఘటించినప్పటికి గొలుసు తెంపుకొని పరారయ్యారు. భవాని ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నటు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దారు కేవీ శివయ్య అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై పీఏసీఎస్, డీసీఎంఎస్, డీఈవో, రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణలో తేమ శాతాన్ని కచ్చితంగా అంచనా వేయాలన్నారు. ట్రక్‌షీట్ జనరేషన్, ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాక్ రికార్డు పక్కాగా ఉండాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం సూచించిన నిర్ణీత గడువు లోపు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.రజిని, పౌరసరఫరాల డీటీ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు కేవీ శివయ్య

లా విద్యార్థినిపై లైంగిక దాడి అమానుషం

● నిందితులను కఠినంగా శిక్షించాలి
● ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా డిమాండ్

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో లా విద్యార్థినిపై లైంగిక దాడి అమానుషమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నిందితులను శిక్షించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ఉయ్యూరులో విద్యార్థులు ర్యాలీ చేశారు. ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. బాలికలు, మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించి, మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.కీర్తి డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు రాజేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏలూరు జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి కె.ఆర్. ప్రసాద్ అన్నారు. గురువారం ఆదిత్య బధిర విద్యాలయంలో ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు ప్రభుత్వాసుపత్రి, వట్లూరు పీహెచ్‌సీ సంయుక్తంగా విద్యార్థులకు ఈఎన్‌టీ పరీక్షలు చేశారు. ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలోనూ వైద్య శిబిరం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, వైద్యసిబ్బంది, ఆదిత్య, ఆశాజ్యోతి, పాఠశాల నిర్వాహకులు ఆకుల వెంకటరమణ, అన్నపూర్ణ, మరీదు మాధవీలత, మరీదు వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలి

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే పోటీతత్వం అలవరుచుకుని లక్ష్యసాధన కోసం పట్టుదలతో ముందుకు సాగాలని ఏఎస్ఆర్ కళాశాల గ్రంథాలయ అధికారి బీఎస్ఎస్ పద్మజ పేర్కొన్నారు. 57వజాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఇటీవల ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.బుచ్చిరెడ్డి, గ్రంథాలయ అధికారి టి.నళిని విజేతలను అభినందించారు.

విద్యాభివృద్ధికి లయన్స్ కృషి


బీటెక్ విద్యార్థి అభినయ్‌కు ప్రోత్సాహక బహుమతిగా రూ.10 వేలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ

ఉయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యను ప్రోత్సహించడంలో లయన్స్‌క్లబ్ ముందంజలో ఉంటుందని, పేద, మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ అన్నారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న పెదపాటి అభినయ్‌కు నేరెళ్ల తేజ ఆధ్వర్యంలో రూ.10వేల నగదు ప్రోత్సాహక బహుమతిని గురువారం అందజేశారు. తేజ ఫౌండేషన్, సుధీర్ టింబర్స్, ఎంకే అసోసియేట్స్ సంయుక్తంగా ఆ మొత్తాన్ని క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ నూకల సాంబశివరావు, జోన్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్ ద్వారా అందజేశారు.

టెలివిజన్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

భారతీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు టెలివిజన్ రంగంలో ఉద్యోగ అవకాశాలు బాగున్నాయని లయోలా కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి తెలిపారు. ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో శుక్రవారం ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా టెలివిజన్ ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ డి కూనా, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్థశాస్త్ర విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పుష్కలం

లబ్బీపేట, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): అర్థశాస్త్రం చదివిన వారికి ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆచార్య నాగార్జున యునివర్సిటీ ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు తెలిపారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రవాహ్-2కే 24 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజు విచ్చేశారు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఫైనాన్షియల్, బ్యాంకింగ్ సెక్టార్లలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులకు అర్థశాస్త్ర సంబంధిత అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఐఏఎస్ అకాడమి ఎండీ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోబుల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నోబుల్ హైస్కూల్‌లో గురువారం 2004లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. పూర్వ విద్యార్థులు తోకల కిరణ్, వాకా సర్వేశ్వరరావు, వాసు, శివనాగరాజు, చేబ్రోలు జాషువా మాట్లాడారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

ఓహ్..పెద్ద ప్రమాదమే తప్పింది..!

● విజయవాడలో రోడ్డుపై జారిపోయిన అల్యూమినియం పైపులు



విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్క్రూబ్రిడ్జి, బెంజ్‌సర్కిల్ మధ్య జాతీయ రహదారిపై త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గూడ్స్‌వ్యాన్ డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో దానిపైనున్న అల్యూమినియం పైపులు ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ వాహనాలు లేకపోవడంతో పెద్దగండం తప్పింది. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. గుడివాడకు చెందిన ఒక వ్యక్తి ఇంటీరియర్ డెకరేషన్‌లో సీలింగ్‌కు బిగించే అల్యూమినియం పైపులను గుంటూరు నుంచి తీసుకెళ్తున్నారు. గూడ్స్‌వ్యాన్‌పై ఈ పైపులను పెట్టి కట్టారు. వ్యాన్ స్క్రూబ్రిడ్జి దాటిన తర్వాత బెంజ్‌సర్కిల్ కూడలిలోకి వస్తోంది. ఈ వ్యాన్‌కు ముందు ప్రయాణిస్తున్న రెండు కారులు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. డ్రైవర్లిద్దరూ కార్లను నడిరోడ్డుపై ఆపేశారు. వాటి వెనుక గూడ్స్‌వ్యాన్ వస్తోంది. ముందు రెండు కార్లు హఠాత్తుగా ఆపడంతో వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా రెండుసార్లు బ్రేకులు వేశాడు. వ్యాన్ వస్తున్న ప్రదేశంలో రోడ్డు పల్లానికి ఉంది. దీనితో వ్యాన్‌పై ఉన్న పైపులు ఒక్కసారిగా ముందుకు దూసుకు వచ్చి రోడ్డుపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ మొత్తం ఆగిపోయింది. ముందుభాగంలో వాహనాలు, మనుషులు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బెంజ్‌సర్కిల్ వైపు వాహనాలను ఫ్లై ఓవర్ మీదకు మళ్లించారు. పైపులను రోడ్డు మధ్య నుంచి ఒకపక్కకు చేర్చి ఆగిపోయిన వాహనాలను దారి ఇచ్చారు.

భూముల రీసర్వే సక్రమంగా చేయాలి: కలెక్టర్

మచిలీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న భూముల రీసర్వేను ప్రణాళికాబద్ధంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. భూముల రీసర్వేలో తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే విభాగం అధికారులకు గురువారం తన చాంబరులో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించేందుకు అనుమతి ఇస్తుందన్నారు. రీసర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, ఖచ్చితత్వంతో వ్యవహరించాలన్నారు. తూతూమంత్రంగా భూముల రీసర్వే చేస్తే సహించబోమన్నారు. సాగులోని భూమికి ప్రత్యేకంగా ఎల్‌పీనెంబరు ఇవ్వాలని, భూయజమానుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. డ్రోన్ల ద్వారా ఇప్పటికే భూములకు సంబంధించిన సర్వే జరిగిందని, డిజిటల్ మ్యాప్ ప్రకారం నిజనిర్ధారణ కోసం ఏమేం చేయాలో చెక్‌లిస్ట్‌లను తయారుచేసి అందుకనుగుణంగా ముందుకు వెళ్లాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లోని విస్తీర్ణానికి, ఎఫ్‌ఎంబీలోని విస్తీర్ణం సరిపోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా భూమి రీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

సర్వే పనులను ఉదయం పూటనే నిర్వహించాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్‌కు ముందుగానే గ్రామసభలు నిర్వహించి, భూముల రీసర్వే ఉద్దేశాన్ని రైతులకు వివరించాలన్నారు. రీసర్వే వివరాలను అదేరోజు కంప్యూటర్లలో నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్, మండల సర్వేయర్ రీసర్వే ప్రక్రియపై సమీక్ష చేసుకోవాలన్నారు. కుటుంబసభ్యులు ఆస్తులు పంచుకునేందుకు, సబ్‌డివిజన్ చేసుకునేందుకు రీసర్వే ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చేపల చెరువులు పెద్దగా ఉండటంతో నలుగురైదుగురు రైతులకు చెందిన భూముల సరిహద్దులు నిర్ణయించడం కష్టమని, ఈ సమయంలో స్థానిక వీఆర్వో లేకుండా గ్రౌండ్ ట్రూతింగ్ చేయవద్దని సూచించారు. భూముల రీసర్వే ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఆర్డీవో, సర్వేవిభాగం అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం, ఉయ్యూరు గుడివాడ ఆర్డీవోలు కే స్వాతి, బీఎస్ హేలాషారోన్, బాలసుబ్రహ్మణ్యం, సర్వేవిభాగం ఏడీ జోషిలా, ఎన్టీఆర్ జిల్లా సర్వే విభాగం ఏడీ త్రివిక్రమ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయండి

కలెక్టరేట్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతరత్రా మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రహరీకి రంగులువేయడం, వాకింగ్‌ట్రాక్, డ్రెయిన్ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఖజానా స్ట్రాంగ్‌రూమ్ పనులతోపాటు, పరిపాలనా బ్లాక్, ఎన్నికల విభాగం భవనం పైకప్పు నుంచి నీరు కారకుండా పనులు చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలని సూచించారు. డీఆర్వో చంద్రశేఖరరావు, ముడా అధికారి పద్మావతి, పంచాయతీరాజ్ ఈఈలు లోకేశ్, సుధాకర్ సమావేశంలో పాల్గొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్, అధికారులకు, బ్యాంకు అధికారులకు కలెక్టర్ బాలాజీ జూమ్ మీటింగ్‌లో సూచించారు.



అదరహో..!

అలరించిన శ్రీ కృష్ణపారిజాతం కూచిపూడి నృత్య రూపకం

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రవాస భారతీయురాలు, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్నసత్యం శిష్యురాలు డాక్టర్ శుభ మరువాడ నృత్య దర్శకత్వంలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి కళావేదికపై గురువారం సాయంత్రం ప్రదర్శించిన శ్రీ కృష్ణపారిజాతం కూచిపూడి నృత్య రూపకం నాట్య పరిమళాలు వెదజల్లి రసజ్ఞులైన ప్రేక్షకులను రంజింపజేసింది. శ్రీకృష్ణుడిగా ప్రణుష రెడ్డి, సత్యభామగా అంబికా సిద్దాబత్తుల, రుక్మిణిగా ప్రణవి, నారదుడిగా సంధ్య చూపిన హావభావాలు మంత్రముగ్ధుల్ని చేశాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ నాట్య శిల్పారామం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన సాగింది. ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ చింతా రవి బాలకృష్ణతోపాటు పలువురు యువ కళాకారులు పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదపూడి శాఖ మేనేజర్ సిహెచ్.పరమేష్ జ్యోతి వెలిగించి సభ ప్రారంభించారు. అతిథులకు, కళాకారులకు నిర్వాహకులు మెమెంటోలు అందించి సత్కరించారు.

గ్రంథాలయం సజీవ నది: డాక్టర్ ప్రభాకర్

విజయవాడ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం సజీవ నది అని, అది అందరి మనోదాహార్తిని తీరుస్తుందని, పుస్తకపఠనం వల్ల వికాసం కలుగుతుందని, బహుగ్రంథకర్త, ప్రభుత్వ అధికారి (ఓఎస్‌డీ) డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నేతృత్వంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో తన తాతగారు, వయోలిన్ విద్వాంసుడు పెద్ద జమాలప్పగారి వద్ద పుట్టపర్తి నారాయణాచార్యులు సంగీతం నేర్చుకొన్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాపోషకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ నో మోర్



ప్రసంగిస్తున్న సాహితీవేత్త ప్రభాకర్

టియర్స్ కవితా సంపుటి ద్వారా ఎం.ప్రభాకర్ పరిచయం అయ్యారని, రాజన్న కవి (వసుచరిత్ర కర్త భట్టుమూర్తి పాత్రధారి) మేనల్లుడిగా ఎం.ప్రభాకర్ సుప్రసిద్ధులన్నారు. ప్రభాకర్ తాత పెద్ద జమాలప్ప 4 తీగల ఫిడేలును 7 తీగలుగా మార్చి ధ్వనిని పెంచి అనేక కచేరీలు చేసి కడప జిల్లా ప్రొద్దుటూరుతో పాటు దక్షిణ భారతదేశమంతటా వాయులీనాన్ని విస్తరింపజేశారన్నారు. సహాయ కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ ఇటీవల విద్యార్థుల్లో కొందరు రచనల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య సభకు స్వాగతం పలికారు.

టూరిజానికి నిధుల కేటాయింపు హర్షణీయం: ఆర్వీ స్వామి

ఆటోనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో టూరిజం రంగానికి తగిన ప్రాముఖ్యతనిస్తూ సరిపడ నిధులను కేటాయిండం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వీ స్వామి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌వీ స్వామి

వీలైనంత త్వరగా బెయిల్ పిటిషన్

విచారించండి

● హైకోర్టులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ అభ్యర్థన

● పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులకు కోర్టు ఆదేశం

● విచారణ వారం రోజులకు వాయిదా

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌పై నమోదు చేసిన కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జెత్వానీ కేసులో విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్ గత 63 రోజులుగా జైలులోనే ఉన్నారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని అభ్యర్థించారు. ఈలోపు కౌంటర్ దాఖలు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. పిటిషన్ మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను వారం రోజులకు వాయిదా వేశారు.

నేడు దుర్గా బ్యాంకు బాధితుల సమావేశం

భవానీపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురం చెరువు సెంటర్‌లో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం సమీపంలో దుర్గా- కోపరేటివ్ అర్బన్ బ్యాంకు బాధితుల సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం నేత జింకా చక్రధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాధరపురం బ్యాంకు బ్రాంచి పరిధిలోని డిపాజిటర్లు సకాలంలో హాజరు కావాలని, రాబోయే కార్యాచరణపై చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

4న ఒలింపిక్ అసోసియేషన్ సమావేశం

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలోని ఐలాపురం హోటల్‌లో డిసెంబర్ 4న 11 గంటలకు ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అత్యవసర ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగే 38వ జాతీయ క్రీడలకు చెఫ్ డీ మిషన్ అపాయింట్‌మెంట్, క్రీడలకు కిట్‌లు, యూనిఫామ్స్, ప్రిపరేషన్ ఆఫ్ ది క్వాలిఫైడ్ అథ్లెట్స్, టీమ్ కోచ్‌ల ఎంపిక తదితర అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు.

దుర్గగుడిలో సహస్ర దీపాలంకరణ

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం 20వ రోజైన గురువారం దుర్గగుడిలో యథావిధిగా సాయంత్ర వేళ గంగాపార్వతీ మల్లేశ్వరుల ఉత్సవ మూర్తుల ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను సభక్తిపూర్వకంగా నిర్వహించారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు అధికారులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

కృష్ణాజిల్లా కూచిపూడికి చెందిన అభినయ నాట్య అకాడమీ గురువు కె.వి.జ్యోతి ఆధ్వర్యంలోని 20 మంది కళాకారుల బృందం గురువారం దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. పలు కీర్తనలకు చక్కటి నృత్యం చేసి ఆహూతులను అలరించారు. వారి అభినయానికి ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులకు సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు.

ఘాట్‌రోడ్డులో రాకపోకలకు అనుమతి

కొండ పటిష్ట పనులు అమలు జరుగుతున్న సందర్భంగా రెండు రోజుల పాటు నిలిపివేసిన ఘాట్ రోడ్డులో రాకపోకలను శుక్రవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఈవో కె.ఎస్.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీని బట్టి యథావిధిగా వాహనాల రాకపోకలకు అనుమతిస్తామన్నారు.





తూనికుంట్ల శ్రీనివాసు, చిట్టా అమర సుధీర్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చిట్టా, తూనికుంట్ల ముందుచూపుతోనే

కేబీఎన్ అభివృద్ధి

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి చిట్టా అమర సుధీర్ ముందుచూపుతోనే కేబీఎన్ కళాశాల, పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలు రాష్ట్రంలోనే ఉన్నతస్థాయిలో ఉన్నాయని హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య అన్నారు. సెంట్రల్ అమెరికా వర్సిటీ నుంచి తూనికుంట్ల శ్రీనివాస్‌కు, కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి చిట్టా అమర సుధీర్‌కు ఇటీవల గౌరవ డాక్టరేట్లు అందిన సందర్భంగా వారిద్దరికీ గురువారం కళాశాలలో సన్మానం నిర్వహించారు. ఇద్దరినీ దంపతసమేతంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారిద్దరూ విద్యాభివృద్ధికి చేస్తున్న సేవ ఎంతో ప్రశంసనీయమైనదని కొనియాడారు. కమిటీ అధ్యక్షుడు పి.శేషయ్య మాట్లాడుతూ అనేక సమస్యలతో కేబీఎన్ కళాశాలను శ్రీనివాసు తన నాయకత్వ పటిమతో పరిష్కరించారని నాక్ ఏ డబుల్ ప్లస్ స్థాయికి కళాశాలను తీసుకువచ్చారని కొనియాడారు. కేబీఎన్ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అకుంఠిత దీక్ష, నిరంతర ప్రణాళిక, ముందుచూపుతో సుధీర్, శ్రీనివాసులు ఆయా కళాశాలలను తీర్చిదిద్దారని, అందుకే వారికి డాక్టరేట్ వరించిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హైస్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు పాల్గొన్నారు.

పునాదుల్లోనే నిలిచిపోయిన ఆర్డీవో కార్యాలయం



రివర్స్ టెండరింగ్..!

● నిలిచిన రెవెన్యూ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు

మచిలీపట్నం టౌన్ ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో రివర్స్ టెండరింగ్ పేరుతో గత టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన రెవెన్యూ భవనాల పనులు వైసీపీ హయాంలో నిలిచిపోయాయి. బ్రిటీషు కాలం నాటి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయం శిథిలమైనందున ఆ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించే లక్ష్యంతో 2018 సెప్టెంబరు 28న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కొనకళ్ల నారాయణరావు కార్యాలయాల భవనాలకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరు చేశారు. అలాగే ఆర్డీవో కార్యాలయ భవనానికి రూ.కోటి 50లక్షలు నిధులు మంజూరు చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ పేరుతో ఈ భవనాలను అర్ధాంతరంగా నిలిపేశారు. దీంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో వర్షం వచ్చినప్పుడు కార్యాలయ సిబ్బంది, ప్రజలు పడే అవస్థలు ఇన్నీ అన్నీ కావు. ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో ఆర్డీవో కార్యాలయంలోకి నీరు వెళ్లిపోయేవి. పైకప్పులు శిథిలం కావడంతో ఫైళ్లు తడిసిపోయేవి. ఈ రెండు కార్యాలయాల సిబ్బందితో పాటు కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే అర్జీదారులు సైతం ఇబ్బందులకు గురయ్యేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పునాదుల్లోనే నిలిచిన ఈ రెండు భవనాల నిర్మాణాలు మళ్లీ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

24న ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం డీ2 బ్లాక్‌లోని క్యారమ్స్ అసోసియేషన్ హాల్లో ఎన్టీఆర్ జిల్లా క్యారమ్ పోటీలు పురుషులు, స్త్రీలకు సింగిల్స్, వెటరన్ పురుషులు, స్త్రీలకు సింగిల్స్ విభాగాల్లో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు బి వెంకయ్య, ఎస్‌కే అజ్మతుల్లాలు ఒక ప్రకటనలో తెలిపారు. వెటరన్ విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా 50 ఏళ్ల పైబడిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 23న సాయంత్రం 5 గంటలు కల్లా 9492121727, 9491122634 నెంబర్లలో సంప్రదించాలన్నారు. వచ్చే నెల 7,8న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి క్యారమ్ ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 25న సాయంత్రం 5 గంటల్లోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం, కౌలు రైతుసంఘం నాయకులు

వాగ్దానాలను అమలు చేయాలి

● రైతు నేతల డిమాండ్

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాల మేరకు తక్షణమే సాగు సాయం అందించాలని తదితర డిమాండ్ల సాధనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులు కౌలురైతులు తీసుకొన్న ఖరీఫ్ పంట రుణాలను మాఫీ చేయాలని, తక్షణమే కౌలురైతుల రక్షణ, సంక్షేమానికి సమగ్రమైన కౌలు చట్టం తీసుకురావాలని అందులో కోరారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతు కుటుంబానికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన కూటమి నేతలు గద్దెనెక్కిన 6 నెలల తర్వాత కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ప్రతి రైతు కుటుంబం రూ.2.45 లక్షల అప్పులో కూరుకుపోయిందని ప్రతిరోజు ఏదో ఒక మూల రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని, ఇందులో 90 శాతం కౌలు రైతులేనన్నారు. ఆత్మహత్యల నుంచి రైతులను రక్షించాలంటే కేరళ తరహాలో 'రుణ ఉపశమన చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నేతలు చెరుకూరి సుబ్బారావు, పరుచూరి అజయ్, పత్రి హరికృష్ణ, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందరావు, ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేష్ పాల్గొన్నారు.



బ్లాక్ డ్రస్‌లతో ర్యాంప్‌వాక్ చేస్తున్న విద్యార్థినులు

బ్లాక్.. మ్యాజిక్!

● స్టెల్లాలో మిస్ బ్లాక్ షో పోటీలు

● బ్లాక్ డ్రెస్‌లో అలరించిన విద్యార్థినులు

పటమట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాలలో సాంస్కృతికోత్సవాలు, క్రిస్మస్ ఫీటేట్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు రంగోలి, మిస్ బ్లాక్ పోటీలు నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు సవాళ్లను అధిగమించడం ఎలా అనే అంశంపై అందమైన రంగోలీలను వేశారు. వాతావరణ మార్పులు, అడవులను నరికేస్తే జరిగే పరిణామం వంటి ఎన్నో సందేశాత్మక రంగోలీలు వేశారు. మిస్ బ్లాక్ షో విజేతగా ఆషా ఎంపికైంది. అధ్యాపకులు డాక్టర్ బ్యూలా, సుప్రియ, శైలజ, సూరయ్య, స్వరూప్‌కుమార్, శాంతి, శ్రీ మంజుల, హారిక, అంజనీ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా

రావి ప్రమాణస్వీకారం నేడు



గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడ గురునానక్‌కాలనీ నాక్ కళ్యాణమండపంలో సాయంత్రం 4గంటలకు జరగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తదితరులు పాల్గొనున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం ఎన్నారై వెనిగండ్ల రాముకు అవకాశం ఇచ్చింది. వెనిగండ్ల రాముకు రావి వెంకటేశ్వరరావు వెన్నంటి ఉండి పార్టీ విజయానికి కృషి చేశారు. భవిష్యత్తులో రావికి సముచిత స్థానం కల్పిస్తానని నాడు చంద్రబాబు హామీ యిచ్చారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బందరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆర్డీవో కె.స్వాతి, డ్వామా పీడీ సువర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి సురేంద్రబాబు, సీడీపీవోలు గ్లోరీ, సముద్రవేణి, సుధారాణిలు ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 67 పోస్టులు ఖాళీగా ఉండగా.. మచిలీపట్నం డివిజన్‌లో 3 మినీ అంగన్వాడీ, 17 హెల్పర్ల ఇంటర్వ్యూలకు 48 మంది హాజరయ్యారు. డివిజన్‌లో 3 అంగన్వాడీ, 25 హెల్పర్, ఉయ్యూరు డివిజన్‌లో 3 మినీ అంగన్వాడీ, 2 అంగన్వాడీ కార్యకర్తలు, 15 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలని మండల అధికారులు, సిబ్బందికి మొవ్వ తహసీల్దార్ కె.మస్తాన్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, కొనుగోలు కేంద్రాల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. సిబ్బంది, అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మొవ్వ మండలంలో ఏర్పాటు చేసిన 14 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. ఏవో శివ ప్రసాద్, రీ సర్వే డీటీ పి.జగన్మోహనరావు, డీటీ సీహెచ్ రఘురామ్, ఆర్ఐ విజయదుర్గ పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ పరిశీలన

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ మండలంలో జియో ట్యాగింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, లక్ష్యాన్ని అధిగమించాలని అధికారులు, సిబ్బందిని ఎండీవో జె.విమాదేవి ఆదేశించారు.

మొవ్వ-2 సచివాలయంలో జియో ట్యాగింగ్ ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. మొవ్వ-2 సచివాలయ పరిధిలోని 846 గృహాలకు ఇప్పటికే 650 ఇళ్లకు ఇప్పటికే జియో ట్యాగింగ్‌ను సిబ్బంది పూర్తి చేశారని, మిగిలిన వాటిని కూడా సత్వరమే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. హౌస్ ట్యాక్స్ డేటా ఎంట్రీని పరిశీలించి డిసెంబరు నెలాఖరు నాటికి ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.580

నిర్లక్ష్యానికి నిదర్శనం!

- ఐదేళ్లుగా నిర్మాణానికి నోచని మత్స్యకార భవనం
- పిల్లర్ల దశలోనే పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- మత్స్యకారుల సంక్షేమం పట్టని వైసీపీ ప్రభుత్వం
- పిచ్చిమొక్కలకు ఆవాసంగా షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం



నాగాయలంకలో నిర్మాణ దశలో ఆగిపోయిన మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం

(నాగాయలంక, ఆంధ్రజ్యోతి)

2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కృష్ణా జిల్లా నాగాయలంక మత్స్యకారులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ. కోటితో షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనాన్ని మంజూరు చేసింది. ఈ భవనంలో మత్స్యకారులు తమ విలువైన వలలు భద్రపర్చుకోవడం, సభలు సమావేశాలతోపాటు తుపాను సమయాల్లో రక్షిత భవనంగా ఉపయోగపడుతుంది. చేపల సంతలకు వచ్చే మత్స్యకారులకు వసతిగా ఉండేలా అన్ని సదుపాయాలతో భవనాన్ని నాగాయలంక పడవల రేవులో దక్షిణ భాగంలో నిర్మించేందుకు రెవెన్యూ శాఖ స్థల సేకరణ చేసి మత్స్యశాఖకు అప్పగించింది. అన్ని అనుమతులతో భవనం నిర్మాణానికి సిద్ధం కాగా, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

2019 డిసెంబరు 20న అప్పటి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టరు నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్లు వేసి వదిలేశాడు. నాటి నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్టరు పనులను చేయలేదు. మరో కాంట్రాక్టర్‌కి నిర్మాణ పనులను అప్పగించడంలో అధికారులు కూడా పట్టించుకోలేదు. దాంతో నిర్మానం చుట్టూ పిచ్చి చెట్లు, ఇనుప చువ్వలు తుప్పపట్టి భవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయని మత్స్యకార నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని పూర్తి చేయాలని మత్స్యకార నేతలు పలుమార్లు ఆందోళన చేసినా నాటి వైసీపీ పాలకుల్లో స్పందన లేదు. మండలంలోని మత్స్యకారులందరికీ బహుళ విధాలుగా ఉపయోగపడే ఈ భవనాన్ని కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వైసీపీ కక్షపూరిత చర్య వల్లే..

- లకనం నాగాంజనేయులు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు



తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరు కావటం వల్లనే గత వైసీపీ ప్రభుత్వం ఈ షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవన నిర్మాణాన్నినిలిపివేసింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి

నాగిడి తాతారావు, జిల్లా నాయకుడు



భవన నిర్మాణం ఆగిపోవటం వల్ల మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్లు, వరదల సమయంలో వలలు, వృత్తి పరికరాలు భద్రపర్చుకోవటానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నిధులు మురిగిపోయాయి

-మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, అవనిగడ్డ

మత్స్యకారుల భవనాన్ని సకాలంలో కాంట్రాక్టర్ నిర్మించక పోవటంతో ఆ నిధులు మురిగిపోయాయి. మూడు నెలల క్రితం సదరు భవనానికి నిధులు కేటాయించాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే భవనాన్ని పూర్తి చేస్తాం.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

మత్స్య సంపద కాపాడుకుందాం

ఘంటసాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపం చ మత్స్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమన్వయ కర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మత్స్యకారులకు గుర్తింపును అందించటం కోసం, మత్స్య పరిశ్రమకి ఉజ్వల భవిష్యత్తు ఉండాలనే ఆకాంక్షతో ప్రపంచ మత్స్య దినోత్సవం ప్రతి ఏటా నవంబరు 21న జరుపుకుంటారన్నారు. ప్రపంచంలోని మత్స్య సంపదను కాపాడుకునే చర్యలను మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ వివరించారు. మత్స్య వనరు లు లక్షలాది మందికి ఉపాధిని అందిస్తుందన్నారు. మత్స్యకార సొసైటీ చెరువులలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ మంజువాణి, కృష్ణవేణి, డాక్టర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



విజయవాడకు బస్సులో తరలివెళ్తున్న మత్స్యకారులు

విజయవాడకు తరలిన మత్స్యకారులు

నాగాయలంక : విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవ సభకు మత్స్యకార సంఘ నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు నాయకత్వంలో మత్స్యకారుల సహకార సంఘాల ప్రతినిధులు బస్సులలో, ఇతర వాహనాలలో తరలివెళ్లారు.



గరిశపూడి వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గ్రామీణాభివృద్ధికి కృషి

» ఎంపీ వల్లభనేని బాలశౌరి

కృత్తివెన్ను, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గరిశపూడి వద్ద నుంచి బలరామమూర్తి దిబ్బ వరకు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు గురవారం శంకుస్థాపన చేశారు. అలాగే చినగొల్లపాలెం గ్రామంలో కెనరా బ్యాంకు సాయం రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. జనసేన నేత బండి రామకృష్ణ, పంచకర్ల సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాళ్వాకు నీరిచ్చి ఆదుకోండి

జిల్లా శివారు ప్రాంతంలో ఖరీఫ్ తీరని నష్టాన్ని కలిగించినందున రెండో పంటకు నీరిచ్చి పుణ్యం కట్టుకోవాలంటూ రైతులు కృత్తివెన్ను సెంటర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే కార్లను వారి తమ గోడును వెళ్లగక్కారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరు రెండో పంటకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి, చర్చిస్తానని ఎంపీ తెలిపారు.

మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతాం

» ఎంపీ వల్లభనేని బాలశౌరి » రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఓవరాల్ చాంప్ విశాఖ

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. గత మూడు రోజులుగా జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి 38వ బాక్సింగ్ పోటీలు గురువారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు మచిలీపట్నంలో స్టేడియం నిర్మాణానికి అడుగడుగునా అడ్డు తగిలారన్నారు. కేంద్ర నిధులతో రెండేళ్లలో మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతామన్నారు. విద్యార్థుల చదువు, క్రీడలకు తగిన ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, క్రీడల వల్ల మానసిక, శారీరక వికాసం కలుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, క్రీడాకారులకు తన వంతు సాయం అందిస్తామన్నారు. ఎన్నారై సతీష్ మాట్లాడుతూ, చైనా కన్నా భారతదేశ జనాభా పెరిగిందని, అయితే చైనాతో పాటు అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశం పోటీ పడలేకపోతున్నదన్నారు. ఒలింపిక్ క్రీడల్లో భారతీయులు పోటీ పడేందుకు బాల్యం నుంచి శిక్షణ అవసరమన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ, మూడు రోజులుగా రాష్ట్రంలోని 500 మంది క్రీడాకారులకు భోజన వసతి సదుపాయాలు కల్పించడంలో జాగ్రత్త వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.అజయ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, జాతీయ క్రీడాకారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బందరు ఎంపీ బాలశౌరి



విశాఖ క్రీడాకారులదే విజయం...



ఎంపీ నుంచి షీల్డ్ అందుకుంటున్న విశాఖ జట్టు

విశాఖ క్రీడాకారులు మూడు కేటగిరిల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచి తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్ 14 బాలుర కేటగిరిల్లో విశాఖ జట్టు విన్నర్స్‌గా, విజయనగరం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అండర్ 17 బాలుర పోటీల్లో విశాఖ జట్టు విన్నర్స్‌గా, శ్రీకాకుళం జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అండర్ 17 బాలికల పోటీల్లో విశాఖ జట్టు ప్రథమ స్థానంలో, నెల్లూరు జట్టు రన్నర్స్‌గా నిలిచింది.

అసెంబ్లీ వేదికగా

ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలి

☛ యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా కోరారు. 1276 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బ్రహ్మయ్యలింగయ్య చెరువు రిజర్వాయర్‌గా చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ సొమ్ముతో పాటు మట్టినీ దోచేశారని విమర్శించారు. బ్రహ్మయ్యలింగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. పోలవరం, ఏలూరు కాలువను అనుసంధానం చేయాలని, రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కలం ప్రాంతాల్లో ఏలూరు కాలువపై వంతెనలను నిర్మించాలని కోరారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు ప్రహరీ, రెయినింగ్ పాడైపోయాయని వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యపై..

☛ బొండా ఉమామహేశ్వరరావు



అజిత్‌సింగ్‌నగర్ : సెంట్రల్ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలుగా వేలాది ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదని, పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ కల్పించేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. మధురానగర్ తుంగం రామల వీధి, పాయకాపురంలోని దేవినేని గాంధీపురం, ఎల్‌బీఎస్‌నగర్, పటేల్‌నగర్, పాకిస్థాన్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్‌లోని నందమూరినగర్ ప్రాంతాల్లో సుమారు నాలుగువేల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు 2019లో టీడీపీ ప్రభుత్వం జీవో 74ను తీసుకువచ్చిందని, అనంతరం ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ మరుగున పడిందన్నారు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

శిథిల వంతెనలకు నిధులు కేటాయించండి

☛ వర్లకుమార్ రాజా



పామర్రు : జగన్ ఐదేళ్ల అరాచక పాలనతో విసిగి పోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించి.. రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టే బాధ్యతలు అప్పగించారని.. ఆ బాధ్యత నెరవేర్చాలిన అవసరం తమపై ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అనేక చోట్ల శిథిలావస్థకు చేరిన వంతెనల వల్ల అటు ప్రజలు, ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ప్రమాదకరంగా ఉన్న వంతెనల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్‌శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో దశాబ్ద కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు స్థలం మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విద్యా సుమాలు విరబూయిస్తా

» పదిలో నూరుశాతం ఫలితాలకు కృషి
» వంద రోజుల ప్రణాళికకు రూపకల్పన
» డీఈవో పీవీజే రామారావు



కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పీవీజే రామారావు వరుసగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మీవో కార్యాలయాలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రామారావును 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది.

? కృష్ణాలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు

● జిల్లాలో వివిధ డివిజన్లలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అధిక శాతం ఉపాధ్యాయుల్లో నైపుణ్యం, పట్టుదల కలిగిన వారున్నారు. ఈ ఏడాది విద్యా ప్రమాణాలు పెంచేలా ప్రధానోపాధ్యాయులకు సూచనలిచ్చాం.

? పదో తరగతి విద్యార్థులకు తీసుకునే ప్రత్యేక కార్యక్రమాలు ఏమిటి?

● పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వంద రోజుల ప్రణాళిక రూపొందించాం. ఉదయం గంట, సాయంత్రం గంట అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

? వెనుకబడిన విద్యార్థుల కోసం ఏ కార్యక్రమాలు చేపడుతున్నారు?

● వెనుకబడిన విద్యార్థులను ఆయా సబ్జెక్టు టీచర్లు దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నాం. విద్యావేత్తలతో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం. గతేడాది 90.5 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. టాప్ 5లో జిల్లాను తప్పనిసరిగా ఉంచుతాం.

? విద్యార్థుల గుణాత్మకతను ఎలా బేరీజు వేస్తారు?

● జిల్లాలో ఎంపిక చేసిన 124 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు గణితంలో పరీక్షలు నిర్వహించి వారి స్థాయిని తెలుసుకుంటాం.

? పోటీ పరీక్షలకు ఏ విధమైన తర్ఫీదు ఇస్తున్నారు?

● విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించాం.

? మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

● మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిపేందుకు ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు ఇచ్చాం. ముందుగా భోజనాన్ని రుచి చూడాలని చెప్పాం. భోజనంలో నాణ్యత పాటించాల్సిందే.. అలసత్వం చూపే ఉపాధ్యాయులకు ఎంఈవోలు, డీవైఈవోలు మార్గదర్శకత్వం వహిస్తారు.

(మచిలీపట్నం టౌన్ ఆంధ్రజ్యోతి)

లా విద్యార్థినిపై లైంగిక దాడి అమానుషం

● నిందితులను కఠినంగా శిక్షించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

● గుడివాడలో విద్యార్థినుల భారీ ర్యాలీ

గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం లా కళాశాల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు.

విద్యార్థినిపై లైంగిక దాడిని నిరసిస్తూ గురువారం నెహ్రూచౌక్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో విద్యార్థినులు భారీ ర్యాలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పిల్లలు, మహిళలు, విద్యార్థినులపై లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని, వాటిని నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సమరం అన్నారు. నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారని, దీంతో అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై దాడులను అరికట్టాలని, నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని, మత్తు పదార్థాలు, గంజాయి విక్రయిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని సమరం డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు నాగేంద్ర, ఐద్వా కార్యదర్శి పి.రజిని, నాయకులు కుమారి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినీలు

విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ



గుడివాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో విశ్వభారతి పాఠశాలకు చెందిన 27మంది విద్యార్థులు బహుమతులను సాధించారని యాజమాన్యం తెలిపింది. పాఠశాల ఆవరణలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

మినుముకు బీమా చేయించుకోండి

● రైతులకు ఏవో అనంతలక్ష్మి సూచన

గుడివాడ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రబీ మినుము పంటకు రైతులు బీమా చేయింకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి బి.అనంతలక్ష్మి సూచించారు. బీమాతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ సిబ్బందిని ఆమె ఆదేశించారు. గురువారం ఏవో కార్యాలయంలో మండలంలోని వీఏఏలు, మండల విస్తరణాధికారులకు మినుము పంటకు ఇన్సూరెన్స్ చేయడంపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎకరాకు రూ.81 చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. ఇన్సూరెన్స్ చేయించిన మినుము పైరు ప్రకృతి వైపరీత్యాల వల్ల పాడైతే రూ.20 వేల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. మండలంలో టాటా ఐఎంజీ కంపెనీ మినుముకు ఇన్సూరెన్స్ చేస్తోందని, బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు పంటపై ఇన్సూరెన్స్ ఉంటుందని, రుణాలు తీసుకోని రైతులు బీమా చేయించుకునేలా అవగాహన కల్పించాలని ఏవో సూచించారు. మండల విస్తరణాధికారులు పి.అనిత, డి.అనూష, వీఏఏలు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ కార్యదర్శి అప్పారావు

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

● ఏఎన్ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి అప్పారావు


గుడివాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం సమకూరుతుందని, దీనికి అధిక సమయాన్ని కేటాయించాలని విద్యార్థులకు ఏఎన్ఆర్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి కేఎస్ అప్పారావు సూచించారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కళాశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం ఆయన బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, గ్రంథాలయ అధికారి సుభాషిణి, మనోజ, జ్యోతి, రమేష్, కుమార్ పాల్గొన్నారు.



అన్నదానానికి రూ.10 వేలు వితరణ

గుడివాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాటిమీద వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం భక్తుల సహకారంతో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. న్యాయ వాది దిట్టకవి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె న్యాయవాది లక్ష్మీకుమారి గురువారం శాశ్వత అన్నదాన కార్యక్రమానికి రూ.10వేలు వితరణగా ఆలయ ఈవో కేవీ గోపాలరావుకు అందజేశారు.





బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.580

26న ధర్నా, ర్యాలీ విజయవంతం చేయాలి

చల్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఈ నెల 26న జరిగే ర్యాలీ, ధర్నా కార్యక్రమానికి రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏపీ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. గుంటూరు బాపనయ్య శ్రామిక భవన్‌లో ఏపీ రైతు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు మాట్లాడుతూ రైతు, కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ దేశవ్యాప్తంగా అఖిల పక్ష, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల పిలుపు మేరకు 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సీఐటీయూ చల్లపల్లి మండల కార్యదర్శి ఎం.డి..కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కోరుతూ నిరసన ప్రదర్శన చేస్తున్న వైసీపీ

డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి

అవనిగడ్డ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం అవనిగడ్డలో నిరసన ప్రదర్శన చేపట్టారు. టెట్ తర్వాత మూడు నెలల కాల వ్యవధి ఉండాలంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. 16,347 పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారో అర్థం కానీ పరిస్థితి ఏర్పడిందని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.రవిచంద్ర, విద్యార్థి విభాగం నాయకులు శ్రీనివాస్, కె.శివారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు మండల, గ్రామ కమిటీలు

ఘంటసాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ధాన్యం కొనుగోలు చేసేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలను వేసినట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లపై గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, . ధాన్యం సేకరణలో సమస్యలు ఉంటే కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు. ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాల్లో ధాన్యం తాలుకా నగదుతోపాటు గోనె సంచులు, హమాలీ, రవాణా ఖర్చులను (రైతులు ఏర్పా టు చేసుకుంటే) జమ చేయటం జరుగుతుందని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ, మండల కమిటీ రైతు ప్రతినిధి వేమూరి సాయి వెంకట రమణ, వీఏఏలు, పీఏసీఎస్ సెక్రటరీలు, మిల్లర్లు పాల్గొన్నారు.



కాజ్‌వే నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్

ఎడ్లంక కాజ్‌వేను సొంత ఖర్చుతో పునరుద్ధరిస్తా

● ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ హామీ

అవనిగడ్డ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాజ్‌వే కొట్టుకుపోయి పాత ఎడ్లంక గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ముందుకు వచ్చారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయానికి వచ్చిన గ్రామస్థులు గోవర్ధన్‌కు తమ సమస్యలను వివరించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసు కున్న గోవర్ధన్ వెంటనే స్పందించి కాజ్‌వేను పునర్నిర్మించేందుకు అవసరమైన ఖర్చును తాను భరిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే ఎడ్లంక కాజ్‌వే కొట్టుకుపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. అప్పటికప్పుడే ఎక్స్‌కవేటర్‌ను పిలిపించి పనులు ప్రారంభించాలని కోరగా, పోటు తగ్గిన తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. శుక్రవారం కాజ్‌వే పునరుద్ధరణ పనులన ప్రారంభించి వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని గోవర్ధన్ చెప్పారు. టీడీపీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, మేడికొండ విజయ్, మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు కొల్లూరి వాసు, ఒడుగు రవి తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం డివిజన్ ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కమిషన్ పెంచాలంటూ ఎల్ఐసీ ఏజెంట్లు గురువారం డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం సౌత్ సెంట్రల్ జోనల్ జనరల్ సెక్రటరీ పి.ఎల్. నరసింహారావు ధర్నా శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. బీమా విస్తార్, బీమా వాహక్ ప్రతిపాదనలు రద్దు చేయాలన్నారు. పాలసీదారులకు మెరుగైన బోనస్‌లు ఇచ్చే పాలసీని ప్రవేశపెట్టాలన్నారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి జి. రవికిషోర్, రాష్ట్ర సంఘ కోశాధికారి పి. శ్రీనివాసరావు, మచిలీపట్నం డివిజన్ ఎల్ఐసి ఏజెంట్ల సంఘ అధ్యక్షుడు వై. గాంధీ రామ మోహనరావు, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి కె. ఉదయశంకర్, ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షుడు కె.రాజారావు, సీఐటీయూ నాయకులు టి. చంద్రపాల్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్, రిటైర్డు ఉద్యోగుల సంఘ నాయకుడు ధనుంజయ తదితరులు హాజరయ్యారు.



కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించి, బ్యాటింగ్ చేస్తున్న మంత్రి రవీంద్ర సతీమణి నీలిమ, సీనియర్‌నేత గోపీచంద్

పోర్టుతో యువతకు పుష్కలంగా ఉపాధి

● కొల్లు ఫౌండేషన్ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రవీంద్ర సతీమణి నీలిమ

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోర్టు నిర్మాణంతో పలు పరిశ్రమలు వస్తాయని, తద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నోబుల్ కళాశాల ఆవరణలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 52 జట్లు పాల్గొంటున్నాయి. నీలిమ మాట్లాడుతూ, యువతలో పోటీ తత్వం పెంపెందించేందుకు, శారీరక , మానసిక వికాసం కలిగేం దుకు క్రీడలు దోహదపడతాయన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, యువతను చైతన్యపరిచే కార్యక్రమాలను కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్నామన్నారు. జనవరి నెలలో యువకెరటాలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. యువతను సన్మార్గం వైపు నడిపించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర నిష్ణాతులైన విద్యావేత్తలతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. _ టీడీపీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత , తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు. నాకౌట్ పద్ధతిలోఈ పోటీలు నిర్వహిస్తున్నారు. డిసెంబరు 9 తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని మంత్రి రవీంద్ర కుమారుడు కొల్లు పునీత్ తెలిపారు.



ఈవో టి.వి.వి.మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న కోటి

సంబరాల్లో పైడమ్మ ఉచిత దర్శనానికి అనుమతించాలి

పెడన, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెడన పైడమ్మతల్లి సంబరాలు డిసెంబరు 14 నుంచి 24 వరకు జరుగుతాయి. 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే సంబరాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి ఉచిత దర్శనం కల్పించాలని కోరుతూ ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్, హిందూ బంధువుల ఐక్యవేదిక ప్రతినిధులు ఆలయ ఈవో టి.వి. వి. మోహనరావుకు వినతిపత్రం ఇచ్చారు. సంబరాలలో ఉచిత దర్శనం కల్పిస్తామని ఈవో హామీ ఇచ్చారని హిందూ బంధువుల ఐక్యవేదిక ప్రతినిధి కోటి తెలిపారు.



న్యూఢిల్లీలో పురస్కారం అందుకుంటున్న కొడాల భక్తపాల్

భక్తపాల్‌కు క్రైస్తవ సేవా సామాజికవాది పురస్కారం

ఘంటసాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దిరిశంవాని దళితవాడకు చెందిన కొడాలి భక్తపాల్ జాతీయ క్రైస్తవ సేవా సామాజిక వాది పురస్కారం అందుకున్నారు. నేషనల్ ఇండి పెండెంట్ బిషప్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఐదో నేషనల్ లీగల్ కాన్ఫరెన్స్ గురువారం ఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేసిన కొడాలి భక్తపాల్ సంస్థ మార్టిన్ కాత్రగడ్డ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తపాల్‌కు అభినందనలు తెలియజేశారు మండలానికి చెందిన పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, సామాజిక సేవా కార్యకర్తలు అభినందించారు.



నోబుల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నోబుల్ హైస్కూల్‌లో గురువారం 2004 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. ఆడిటోరియంలో జరిగిన ఆత్మీయ కలయికలో రెండు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తోకల కిరణ్, వాకా సర్వేశ్వరరావు, వాసు, శివనాగరాజు, చేబ్రోలు జాషువా తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులను సత్కరించారు.



ఎస్‌వీఎల్‌లో సామూహిక సాయివ్రతాలు

అవనిగడ్డ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌వీఎల్ కళాశాలలో సామూహిక సాయి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు - వెంకట వసుమతి దంపతులు విద్యార్థులతో సామూహిక సాయి వ్రతాలను ఆచరించారు. సాయి పురోహిత్ పి.పద్మావతి బ్రహ్మత్వం వహించారు. సాయిబాబా గ్రామోత్సవం నిర్వహించారు.

శరీరదానం, నేత్రదానం

నాగాయలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక రెండో వార్డుకి చెందిన కొడాలి సుబ్బారావు (85) బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన శరీరాన్ని ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలనకు, కళ్లను విజయవాడ ఎల్వీ.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్లు కుటుంబసభ్యులు తలశిల ఉషారాణి, రాము, కొడాలి సత్యనారాయణ, తలశిల వెంకటేష్ తెలిపారు. ఎల్వీ. ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది కళ్లను, ఏలూరు వైద్యకళాశాల సిబ్బంది శరీరాన్ని నాగాయలంక వచ్చి తీసుకున్నారు. ఈ కార్యక్రమాలను సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో ఇది 214 నేత్రదానం కాగా, తొమ్మిదో శరీర దానమని తెలిపారు.



వైభవంగా పడిపూజ

నాగాయలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రసన్న గణపతి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిగింది. లక్ష్మీనారాయణ గురుస్వామి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలి వెంకట్రామ్ హాజరయ్యారు అయ్యప్ప శరణు ఘోష అర్ధరాత్రి వరకు కొనసాగింది.

కాపు వనసమారాధనకు విస్తృత ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి రైల్వేస్టేషన్‌కు దగ్గరలోని కొండపల్లి ఎస్టేట్‌లో కాపు ఆత్మీయ కలయిక, వనభోజనాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. నగరం నిండా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఆదివారం 20 వేల మందికి వనభోజనాల ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు కొట్టి వెంకట్రావు తెలిపారు.



నోబుల్ సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

నోబుల్ సేవలు చిరస్మరణీయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో విద్యా సంస్థను స్థాపించిన నోబుల్ సేవలు మరచిపో లేమని వెరీ రెవరెండ్ సి.ఎల్. జాస్పర్ అన్నారు. నోబుల్ విద్యా సంస్థల 181వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా జరిపారు. ¬ ఇంగ్లీషు చర్చి ఆవరణలో ఉన్న నోబుల్ సమాధి వద్ద మత గురువులు, అధికారులు, ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, లెక్చరర్లు, టీచర్లు నివాళులర్పించారు. సెయింట్ మేరీస్ చర్చి వికార్ గురువు వెరీ రెవరెండ్ సిఎల్ జాస్పర్ ఆరాధన నిర్వహించారు. నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జె ఎర్నెస్ట్, కృష్ణాగోదావరి డయాసిస్ సెక్రటరీ సుధీర్‌దత్‌తో పాటు పలువురు విశ్రాంత అధ్యాపకులు పాల్గొన్నారు.

మినీ గోకులానికి శంకుస్థాపన



ఘంటసాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూరపనేని వారిపాలెంలో పాడి రైతు సూరపనేని రమేష్‌కు మినీ గోకుల పథకం మంజూరు కాగా, పశువుల షెడ్ల నిర్మాణానికి గురువారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) మాట్లాడుతూ పశువుల సంరక్షణకు ప్రభుత్వం మినీ గోకులం పథకం ద్వారా రాయితీపై పాడి రైతులకు షెడ్లు నిర్మిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రూ.2.30 లక్షల విలువ గల యూనిట్ మంజూరైనట్లు తెలిపారు. శ్రీకాకుళం ఉపసర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దాసం రామకృష్ణ, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కొండవీటి పవన్ కుమార్, టీడీపీ నాయకులు కటారి తాతయ్య, సూరపనేని కిషోర్, పర్వతనేని రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దింటిమెరకలో రహదారికి శంకుస్థాపన



కోడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. దింటిమెరక గ్రామంలో రూ.9.90 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, తిరుమలశెట్టి సునీత, గుమ్మడి సాంబశివరావు, లంకే రవి, పోనమాల వెంకటేశ్వరరావు, వెన్నా గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోకర్ణేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన



కోడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో నాలుగు వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తీక దీపోత్సవం 25న

కోడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపాలెం శ్రీ మన్నారాయణస్వామి ఆలయం వద్ద ఈనెల 25వ తేదీన కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు అష్టాక్షరీ సంపత్ రామానుజ జీయర్ స్వామి తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.